క్లుప్తంగా

సబ్సిడీ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

మొగల్తూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నారుమడులు దెబ్బతిన్న రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంట్లో భాగంగా మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం గ్రామాల రైతులు సుమారు 312 మంది 115 క్వింటాళ్ల విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. రామన్నపాలెంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1153 రకం విత్తనాలను 80 శాతం సబ్సిడీపై రైతులకు అందించారు. రామన్నపాలెం గ్రామ సర్పంచ్ బందెల ఏలిషా, ఉప సర్పంచ్ మేకల పరుశు రామ్, మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, ఆర్బీకే సిబ్బంది రాజ్‌గోపాల్, కావ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు టౌన్ సీఐగా కోలా రజనీ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో కూడా పాలకొల్లు సీఐగా పని చేశారు. ఆయనను సర్కిల్‌లోని పలువురు ఎస్‌ఐలు అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలు పరి రక్షణకు, ట్రాఫిక్ నియంత్రణకు, పేకాట, జూదం అరికట్టేందుకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.

యలమంచిలి ఎస్సైగా..

యలమంచిలి: ఎస్సైగా కె.గురవయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆయన నరసాపురం రూరల్ ఎస్సైగా పనిచేస్తూ బదలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన కాకి శివనారాయణకు పోస్టింగ్ ఇవ్వలేదు. గురవయ్య తడికలపూడి, పెంటపాడు, మొగల్తూరు, ఆకివీడు, తాడేపల్లిగూడెం పట్టణం, నిడమర్రు, తణుకు రూరల్ ఎస్సైగా పనిచేశారు.

నరసాపురం టౌన్ ఎస్సైగా..

నరసాపురం: టౌన్ ఎస్సైగా జయలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన జయలక్ష్మి గతంలో నరసాపురం, పాలకొల్లు ట్రాఫిక్ ఎస్సైగా పని చేశారు. భీమవరం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సైగా పని చేస్తున్న ఆమెను బదిలీల్లో భాగంగా నరసాపురం టౌన్ ఎస్సైగా నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైను స్టేషన్ సిబ్బంది అభినందించారు.

పోస్టాఫీసులో 'జనంలోకి మనం'

పెనుగొండ: ప్రజల సౌలభ్యం కోసం వారిపై అధిక భారం పడకుండా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టాఫీసుల్లో ఎన్నో స్కీములు అమలు పరుస్తున్నట్లు తణుకు ఏఎస్‌పీ సూర్య ప్రకాష్ తెలిపారు. బుధవారం పెనుగొండ పోస్టాపీసు ఆధ్వర్యంలో జనంలోకి మనం కార్యక్రమం నిర్వహిస్తున్న పోస్టాఫీసుల్లో అమలు చేస్తున్న స్కీములు, జీవిత బీమా పథకాలను వివరించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని భగ్గేశ్వరం గ్రామానికి చెందిన జుత్తిగ వీరాస్వామి (53) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భగ్గేశ్వరం గ్రామానికి చెందిన జుత్తిగ వీరాస్వామి గ్రామ పెద్దగా ఉండేవారు. మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో పురుగు మందు తాగి పడిపోయాడు. అతని కుమారుడు శ్రీను భీమవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు.పరిస్థితి విషమించిందని వైద్యులు సూచించడంతో ఇంటికి తీసుకు వచ్చిన తరువాత వీరాస్వామి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయుల పట్టాభిషేక దినోత్సవం



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు (సెంట్రల్): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయ పాలనలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాహితీ రంగాలలో సమూలాభివృద్ధి జరిగిందని శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అన్నారు. శ్రీకృష్ణదేవరాయు లు 515వ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా బుధవారం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. సుంకర గణేష్, పినిశెట్టి శ్రీనివాస్, మండేల ఫణి నాథ్, తదితరులు రాయల కీర్తిని కొనియాడారు.

చదువుల తల్లి చిన్నబోయింది

- సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాల
- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి



మొగల్తూరు ఉన్నత పాఠశాల



పాఠశాల ఆట స్థలంలో నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా, నటులుగా, విద్యావంతులుగా, అధికారులుగా తీర్చి దిద్దిన చదువుల తల్లి మొగల్తూరు ఉన్నత పాఠశాల నేడు దిక్కు తోచని స్థితిలో చిన్నబోయింది. మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు అనే ఆయన సుమారు 10 ఎకరాల విస్తీర్ణాన్ని ఉన్నత పాఠశాలకు దానం చేశారు. దీంతో అప్పటి గ్రామపెద్దలు, నాయకులు స్థల దాత పేరును ఆ పాఠశాలకు పెట్టి, పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. దీంతో మొగల్తూరు మండలంలోని 17 గ్రామాలకు ఈ ఒక్క పాఠశాలే దిక్కుగా ఉండేది. ఇదే పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు కృష్ణంరాజు రెబల్ స్టార్‌గా, ఆయన తమ్ముడు సూర్యనారాయణ రాజు ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ గోపీ కృష్ణా మూవీస్ అధినేతగా, చిరంజీవి మెగా స్టార్‌గా పేరు పొందారు. అంతేకాక షార్ డైరెక్టర్‌గా ఎంవైఎస్ ప్రసాద్, భారత వాయుసేనలో వింగ్ కమాండర్‌గా అనంతపల్లి జయకర్, ఆర్మీలో ఉన్నతాధికారులుగా కల్నల్ వీకే రావ్, కల్నల్ వీకే విఠల్ ఈ గ్రామస్తులే కావడం, ఈ స్కూల్ విద్యార్థులే అవడం విశేషం. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపు అన్నట్లుగా రెండో వైపు పాఠశాల శిథిలావస్థకు చేరినా, ఆట స్థలం చెరువును తలపిస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకంలో మండలంలో అనేక పాఠశాలలు అభివృద్ధి చెందాయి. అయితే అప్పటి స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో పాఠశాల రూపురేఖలు మారలేదు. దీంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తరగతి గదుల్లోకి వచ్చేందుకు వీలుగా పాఠశాల ఆట స్థలం పూడ్చివేతకు దాతలు ముందుకు రావాలని ప్రస్తుత ఉపాధ్యాయులు కోరుతున్నారు. దీంతో పాఠశాల పూర్వ విద్యార్థులైన మొగల్తూరు పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు సుమారు 200 ట్రక్కుల మట్టిని ఉచితంగా అందించారు. అయితే పాఠశాల ఆట స్థలాన్ని పూడ్చటానికి కనీసం మరో 600 ట్రక్కుల మట్టి కావాలని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావాలని ఉపాధ్యాయులు కోరడంతో కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు రవి శంకర్ సర్కార్ రూ.50 వేలు, ఒక బ్యాచ్ విద్యార్థులు రూ.45 వేలు అందించగా, మరో బ్యాచ్ విద్యార్థులు ఇప్పటి వరకు రూ.60 వేలు వసూలు చేసినట్లు తెలిసింది. ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించిన పాఠశాల ఉన్నతికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం శుభ పరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు (సెంట్రల్): వచ్చే నెల 14న పాలకొల్లు న్యాయ స్థానాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పాలకొల్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. వాదించుకుంటే ఎవరో ఒకరే గెలుస్తారని, చర్చించుకుంటే సమస్య పరిష్కారమవుతుందనే ఉద్దేశ్యంతో దేశ అత్యున్నత న్యాయ స్థానం న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. విలువైన కాలాన్ని, సొమ్మును వృధా కానీయకుండా ఉభయులు అంగీకారమైన తీర్పును పొందవచ్చన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కళాశాల పాలకవర్గ అధ్యక్షుడి మృతికి సంతాపం

పెనుగొండ: ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలక వర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ మృతికి ఎమ్మెల్సీ వంక రవీంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం పోడూరుమండలం కొమ్ము చిక్కాలలో పితాని నివాసంలో పితాని సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్యను పరామర్శించారు.

మత్తు పదార్థాలతో జీవితం దుర్భరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ యాదగిరి

నరసాపురం: మాదక ద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు వాడడం వలన విద్యార్థుల జీవితాలు దుర్భరమవుతాయని నరసాపురం టౌన్ సీఐ బి.యాదగిరి సూచించారు. బుధవారం వైఎన్ కళాశాలలో ఐక్యూఏసీ, సామాజిక సేవా విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి నాశనంతో పాటు కుటుంబ మర్యాదలు కూడా పోతాయన్నారు. డ్రగ్స్ అమ్మకాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.చింతారావు, డీన్ గంధం రామకృష్ణ, డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, సామాజిక సేవాకేంద్రం సమన్వయకర్త బీఎస్ఎస్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

నరసాపురం రూరల్: జిల్లాలోని రైతాంగానికి రావాల్సిన ధాన్యం బకాయిల విషయంలో రైతులను మోసం చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ లబ్ది కోసం ఉచిత హామీలు అమలు చేస్తామని చెబుతూ రైతులను బలి పశువులను చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 30 వేల మంది రైతులకు రూ.450 కోట్లు రావాలని, ధాన్యం అమ్మి 3 నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని గత నెల 31న జిల్లా డీఎం ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించగా ఆగస్టు 6 లోపు చెల్లిస్తామని సాక్షాత్తు పౌర సరఫరాల శాఖ రాష్ట్ర ఫైనాన్స్ అధికారిణి నాగ సుధారాణి హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకూ ధాన్యం డబ్బులు రాకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడితే మరో వారం రోజులు గడువు చెబుతున్నారని తక్షణమే ధాన్యం డబ్బులు చెల్లించకపోతే ఈ నెల 9న నరసాపురం బైపాస్ వద్ద ధర్నా చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున రైతాంగం పాల్గొనాలని రామాంజనేయులు కోరారు.

పట్టణాభివృద్ధిపై దృష్టి సారించాలి



మట్టిదిబ్బలతో దర్శనమిస్తున్న లాకు రోడ్డు

నరసాపురం: పట్టణ సుందరీకరణ, అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కనబడుతుంది. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉన్నా పట్టణ పరిస్థితి దారుణంగా తయారయ్యింది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకుల నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ, మత్స్యపురి వంతెన నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి రెయిలింగ్ ధ్వంసమయ్యింది. కొండాలమ్మ గుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ చోరుల పాలవుతుంది. గోదావరి బండ్‌కు వెళ్లే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రోడ్డు పక్కన మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ , తెలుగు, ఆక్వా కల్చర్ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకం కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ డిగ్రీ కలిగి 55 శాతం లేదా ఆపైన మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు, అదనపు అర్హతలు–పీహెచ్‌డీ/నెట్/ఏపీ సెట్, బోధన అనుభవం కలిగి ఐసీటీ టూల్స్ ద్వారా ఆన్లైన్, ఆఫ్లైన్ విధానంలో బోధించగలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను, సర్టిఫికెట్లను ఈ నెల 17 లోపు కళాశాల కార్యాలయం నందు సమర్పించాలన్నారు. దరఖాస్తుదారులు 20వ తేది ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

డీఎన్నార్‌లో చేనేత వస్త్ర ధారణ పోటీలు



చేనేత కార్మికుడు వీరభద్రాన్ని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు (సెంట్రల్): స్థానిక దాసరి నారాయణరావు మహిళా కళాశాలలో డబ్ల్యూఈసీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు చేనేత వస్త్ర ధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చేనేత కార్మికుడు వీరభద్రం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చేనేత ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మన దేశ సుసంపన్నమైన విభిన్న సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నేటి యువతను తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.రవిశంకర్, మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే అమృతం



తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఆర్డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నరసాపురం లయన్స్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముర్రుపాలలో కొలెస్ట్రామ్ అనే పదార్థం బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తుందన్నారు. ఆరు నెలలు కేవలం తల్లి పాలను మాత్రమే బిడ్డకు ఇవ్వడం ద్వారా బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదల బాగుంటుందన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠదాయకమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుప్రియ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నళిని, వైద్యులు రామకృష్ణ, శిరీష, గణేష్‌బాబు, హారిసన్, దిలీప్‌కుమార్‌శాస్త్రి, సూపరిటెండెంట్ జ్యోతి, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం, సీడీపీవో బి.ఊర్మిళ, బొమ్మిడి సునీతా నాయకర్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

పాలకొల్లు అర్బన్: పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు పట్టించడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు అన్నారు. మండలంలోని ఉల్లంపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు పద్మాజీరావు అధ్యక్షతన నిర్వహించారు. సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు యూకేసీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. యూకేసీ క్లబ్ మహిళలకు గర్భిణీలకు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, పండ్లు అందజేసి అక్షింతలు జల్లి పండంటి బిడ్డలకు జన్మనివ్వాలని గర్భిణులను ఆశీర్వదించారు. ఏఎన్ఎం ఆర్.భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సజిని, అంగన్‌వాడీ టీచర్లు బి.నాగలక్ష్మి, బి.సురేఖ, ఎం భాగ్యలక్ష్మి, ఎ చంద్రకాంత పాల్గొన్నారు.

అరట్లకట్టలో...

కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించడంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ విజిటర్ డి.కమల అన్నారు. మండలంలోని అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి 100, తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. యువతులను లైగింక వేధింపులకు గురి చేస్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం టి.రూపాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీష పాల్గొన్నారు.

చేనేతకు ప్రత్యేక గుర్తింపు

- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం
- ర్యాలీలు, సన్మానాలు చేసిన వైనం



జాతీయ చేనేత దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్‌లో చేనేత కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం



వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: హస్త కళల్లో చేనేతకు ప్రత్యేక గుర్తింపు ఉందని, చేనేత వస్త్రాల రూపకల్పనలో కార్మికులకు విశిష్ట ప్రాధాన్యం ఉంటుందని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు గున్నేపల్లి పుల్లాజీ తెలిపారు. బుధవారం వడలిలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసాని విజయలక్ష్మీపెద్దిరాజు, ఎంపీడీవో ఎస్ శ్రీనివాస దొర, ఎస్బీఐ మేనేజరు ఎ.రాంబాబులు పాల్గొన్నారు.

ఎస్వీకేపీలో

పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వడలికి చెందిన చేనేత కార్మికుడు అందే కోటి లింగంను సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, టి.దివాకర్, ఆర్ఎస్ శ్రీనివాస్, పి.మీరయ్య పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలు

పాలకొల్లు (సెంట్రల్): స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. చేనేత వస్త్రాల ఫ్యాషన్ షో, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులు ఈస్మిత, సాయి శ్రీవల్లి, వికాస్ సాయి, పెద్దిరాజు, జ్యోతి, గీతా సత్యవతి, దుర్గ, శ్రావణిలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం ఎన్‌వీఆర్డీ పద్మలత, బి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

పాలకొల్లు సెంట్రల్: చేనేత కార్మికులు తమ వృత్తిలో బాగా వెనుకబడి ఉన్నారని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక వీవర్స్ కమ్యూనిటీ భవనం నందు సంఘ జిల్లా అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలో ముందుగా పూలపల్లి వై జంక్షన్ నుంచి సుమారు 500 ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పొన్న మల్లిఖార్జున రావు, బొప్పే సత్యలింగం,కార్యదర్శి నీలంశెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: చేనేత కార్మికులే తమ ఉత్పత్తులను ఎగుమతులు చేసే స్థాయికి ఎదగాలని నరసాపురం రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ డాక్టర్ అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం నరసాపురం మండలం రుస్తుంబాదలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్‌లో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో 10వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు సంఘాలుగా ఏర్పడి చేనేత వస్త్రాలను స్వయంగా ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ఆల్ ఇండియా క్రోచెట్ లేస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి కలవకొలను వీరాస్వామి, లేస్ఎక్స్ పోర్టర్లు అడ్డగళ్ల బాబు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

నరసాపురం: జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని 18వ వార్డులో వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వనువులమ్మగుడి వద్ద ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ నాయకులు ఒగ్గు సత్యనారాయణ, సమతం శివ ప్రసాద్, చేనేత కార్మిక సంఘ నేత బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గాంధీజీ విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపు సమయంలో స్వదేశీ చేనేత వస్త్రాలు ముఖ్య భూమిక పోషించాయని చెప్పారు. యంత్రాలకు కూడా సాధ్యం కాని కళాత్మక వస్త్రాలు చేతితో అల్లే సామర్థ్యం ఒక్క చేనేత కార్మికుడికే ఉంటుందన్నారు. సమతం వెంకటేశ్వరరావు, వరదా రామలింగం, వీరభద్రుడు, దొంట్టి సత్యనారాయణ ఉన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

పోడూరు: పోడూరు మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ (యూపీఏ) నూతన కమిటీ అధ్యక్షుడిగా రెవ.జీఎస్ కుమార్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జీవము గల దేవుని ప్రార్థనా మందిరంలో బుధవారం యూపీఏ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవ.ఏసేపురాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా రెవ.సీహెచ్.సూర్యప్రకాష్, సెక్రటరీగా రెవ.ఏసేపురాజు, జాయింట్ సెక్రటరీగా రెవ.బి.ప్రకాష్‌రాజ్, ట్రెజరర్‌గా రెవ.వై.కిషన్ కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా పాస్టర్ ఎన్.రాజబాబు, ఉపాధ్యక్షుడిగా బీడీపీ ప్రసాద్, కమిటీ సభ్యులు పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పెనుగొండ: పెనుగొండ ట్రంక్స్ అండ్ బకెట్ వర్క్స్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొంది. బుధవారం పెనుగొండ త్యాగరాజ గాన సభలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా నౌడు దుర్గారావు, కార్యదర్శిగా దొడ్డిపట్ల శివ, కోశాధికారిగా దొడ్డిపట్ల రాంబాబు, సలహాదారులుగా నందం వెంకట కృష్ణారావు, పిల్లి శంకర్‌లను ఎన్నుకున్నారు.